బాధితులకు నేడు ఫోన్లు అప్పగించనున్న పోలీసులు

అడ్డగుట్ట: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు మంగళవారంలాలాగూడ లోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఇవ్వనున్నట్లు రైల్వే పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా రైల్వే ఐజీ రమేష్‌ నాయుడు హాజరవుతారన్నారు. సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిస్టర్‌(సీఈఐఆర్‌) ద్వారా ట్రేస్‌ చేసి ఈ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తెలంగాణలోనే కాకుండా కేరళ, ఉత్తర్‌ప్రదేశ్‌, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌, బీహార్‌, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల నుంచి కూడా సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా గుర్తించి 970 సెల్‌ఫోన్లు సంబంధిత యజమానులకు అందజేశామని, మంగళవారం లాలాగూడలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో మరో 130 సెల్‌ఫోన్లు అందజేస్తున్నామని తెలిపారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న శ్రీనివాసనగర్‌ కాలనీవాసులు

చిలకలగూడ : పహల్గాం నిందితులను కఠినంగా శిక్షించాలని సీతాఫల్‌మండి డివిజన్‌ శ్రీనివాసనగర్‌ కాలనీవాసులు డిమాండ్‌ చేశారు. సోమవారం జరిగిన సంతాప కార్యక్రమంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి పహల్గాం మృతులకు నివాళులర్పించారు. విశ్వకర్మ మనుమయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్‌ మాట్లాడుతు నిందితులను ఉరితీయాలని, అందుకు బాధ్యులైన ఉగ్ర సంస్థలను సమూలంగా నిర్మూలించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహాత్మ చారి, రాళ్లబండి విష్ణుచారి, రవీంద్ర, చేపూరి వెంకటేశ్వరరావు, మల్యాల కృష్ణ, హరిబాబు, రవీందర్‌, ప్రసాద్‌,చంద్రమౌళిలతోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

పూలే చిత్రం విడుదలపై బీసీ నేతల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: మహాత్మజ్యోతిభా పూలే సినిమా విడుదల పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాలు తెలుసుకునేందుకు కుల, మతాలకు అతీతంగా పూలే చిత్రాన్ని ప్రతి ఒక్కరు చూడాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వివిధ రకాల దేవుళ్ల సినిమాలు, పౌరాణిక, విప్లవ, ఇతర పోరాట యోధుల చిత్రాలు విడుదలైనప్పుడు చెప్పని అభ్యంతరాలు కొన్ని వర్గాలు పూలే చిత్రానికి తెలపడం విచారకరమన్నారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్‌గౌడ్‌, బండి నరేష్‌, చంద్రమోహన్‌ రాయ్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

బౌద్ధనగర్‌: మరో వారం రోజుల్లో నిశ్చితార్థం ఉండగా ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.వారాసిగూడ పోలీసులు తెలిపిన మేరకు.. బౌద్ధనగర్‌కు చెందిన గడ్డం మోహన్‌కృష్ణ (30) ముషీరాబాద్‌లోన మెకానిక్‌ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9.30 గంటలకు తల్లి లక్ష్మి డ్యూటీకి వెళ్లగా మోహన్‌ కృష్ణ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తల్లి విధులు ముగించుకుని ఇంటికి రాగా తలుపులు వేసి ఉన్నాయి. పెద్ద కుమారుడికి చేయగా ఆయన వచ్చి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లారు. ఇంట్లో సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మోహన్‌ కృష్ణ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారువచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగా గాంధీ మార్చురికీ తరలించారు. ఇదిలా ఉండగా మోహన్‌కృష్ణకు వచ్చే నెల 4న నిశ్చితార్థం జరగాల్సి ఉంది.

వాటర్‌ట్యాంకర్‌ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన లోకేశ్వర్‌రావు..

సనత్‌నగర్‌: ప్రైవేట్‌ వాటర్‌ ట్యాంకర్‌ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సార్‌నగర్‌ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్‌ తెలిపిన మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన లోకేశ్వర్‌రావు (62), సుధారాణి (60) దంపతులు ఆదివారం సాయంత్రం బైక్‌పై బల్కంపేట మీదుగా ఫతేనగర్‌కు వెళ్తున్నారు. ఎల్లమ్మ ఆలయ సమీపంలో వేగంగా వచ్చిన వాటర్‌ ట్యాంకర్‌ వెనకనుంచి వారి బైక్‌ను ఓవర్‌టేక్‌ చేయబోయి ఢీకొట్టింది. ఈ సంఘటనలో కిందపడి తీవ్రంగా గాయపడిన లోకేశ్వర్‌రావును హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సుధారాణికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ లోకేశ్వర్‌రావు సోమవారం మృతి చెందాడు. ట్యాంకర్‌ డ్రైవర్‌ దశరథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పేరుకే అది పార్కు

● కొండారెడ్డి పార్కులో కనుమరుగైన పచ్చదనం ● పేరకుపోయిన చెత్తా చెదారం



తుకారాంగేట్‌ కొండారెడ్డి పార్కులో కనుమరుగైన పచ్చదనం

అడ్డగుట్ట: ఆహ్లాదం పంచాల్సిన పార్కు అధ్వానంగా తయారైంది. పిల్లలు ఆడుకునేందుకు, వృద్ధులు కాలక్షేపం చేసుకోవడానికి వాకింగ్‌ చేసుకునేందుకు ఉపయోగపడాల్సిన పార్కు అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిరుపయోగంగా మారుతుంది. స్థానికులకు పార్కు అందుబాటులో ఉన్నప్పటికీ అందులో పచ్చదనం, వాకింగ్‌ ట్రాక్‌ లేకపోవడంతో పాటు ఎక్కడపడితే అక్కడే చెత్తచెదారం ఉండటంతో స్థానికులు పార్కులోకి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాం గేట్‌ కొండారెడ్డి పార్కు గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు

తుకారాంగేట్‌లోని కొండారెడ్డి పార్కులో మొక్కలు



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ ఫ్యూజ్‌ బాక్స్‌

పూర్తిగా ఎండిపోయాయి. పచ్చగడ్డి కూడా ఎండకు ఎండిపోయి మైదానాన్ని తలపించేలాగా కేవలం మట్టి మాత్రమే కనిపిస్తోంది.

చెత్తా చెదారాన్ని తొలగించి పచ్చదనం పెంచాలి

కొండారెడ్డి నగర్‌లోని పార్కుపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా సాయంత్రం వేళలో పార్కుకు వచ్చే వాకర్స్‌, పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కులో ఎండి పోయిన మొక్కలు, గడ్డితో పూర్తిగా చెద్దా చెదారం పేరుకుపోయింది. సరైన వాకింగ్‌ ట్రాక్‌ కూడా లేకపోవడంతో వాకింగ్‌ చేసే సమయాల్లో వాకర్స్‌ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కూర్చునేందుకు ఉన్నటువంటి బెంచీలు కూడా పూర్తిగా విరిగిపోయాయి. పార్కులో పేరుకుపోయి చెత్తను తొలగించి, పచ్చదనాన్ని పెంచాలి.

ఉదయ్‌ యాదవ్‌, బీజేవైఎం డివిజన్‌ అధ్యక్షుడు



పార్కులో విరిగిపోయిన బెంచీ

పనులు ప్రారంభిస్తున్నాం

కొన్ని రోజులుగా పార్కు అభివృద్ధికి టెండర్‌ ప్రక్రియ ప్రారంభమైంది. అందువల్లనే కొంత ఆలస్యం జరిగింది. వారం రోజుల్లో పనులు ప్రారంభించి కొండారెడ్డి పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాము. పనుల కారణంగానే పార్కులో బెంచీలు విరిగిపోయి, మట్టికుప్పలు ఉన్నాయని, వీలైనంత తొందరగా పనులు ప్రారంభించి త్వరితగిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– సురేష్‌, హార్టికల్చ్‌ సూపర్‌వైజర్‌

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడుదాం



మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ అడ్డగుట్ట లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ.. మేడే పోరాటాన్ని, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అంతం చేయాలన్నారు. ఈ పోరాటాలలో కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్‌ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్‌, కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్‌, జోగు రాములు, సత్యనారాయణ, చందర్‌, మల్లేష్‌, వెంకటేష్‌, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసించిన న్యూస్‌ పేపర్స్‌ హాకర్స్‌ అసోసియేషన్‌



ఉగ్రవాదుల దాడిలో మరణించిన మృతులకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్‌: కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన మృతులకు న్యూస్‌ పేపర్స్‌ హాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం క్లాక్‌టవర్‌ ప్రాంతంలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు చేతపట్టుకుని మృతులకు నివాళి అర్పించి స్మరించుకున్నారు. అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు తెగబడటం పట్ల అసోసియేషన్‌ అధ్యక్షులు తమ్మిగొండ శ్రీనివాస్‌ యాదవ్‌ ఖండించారు. నిరపరాధులైన ప్రజలపై అమానవీయదాడి దేశ ప్రజలందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ఆనయకులు సాయికుమార్‌, కేపీ వెంకటేష్‌, రవి, చంద్రశేఖర్‌, సాయియాదవ్‌, ప్రేమ్‌, శ్రీరాములు, నరేష్‌, శంకు, సురేష్‌, శివాజీ, రవి, సాయిబాబా, ప్రభాకర్‌, సురేందర్‌, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మలికార్జునరావు



మాట్లాడుతున్న అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లికార్జునరావు

బొల్లారం: ఏడవ వార్డ్‌ లోని రవికాలనీ ఫేజ్‌–2లో వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నాల్గవ జనరల్‌ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి బోర్డు నామినేటెడ్‌ సభ్యురాలు బానుక నర్మదా మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్‌, సీఐ నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కార్మికులను సత్కరించిన విద్యార్థులు



స్కూల్‌ కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను పురస్కరించుకుని శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్‌ స్కూల్లో సోమవారం కార్మికులను ఘనంగా సన్మానించారు. ఛోటి సి ఆశా పేరుతో పాఠశాల సెక్యూరిటీ, నాన్‌ టీచింగ్‌ స్టాఫ్‌, హౌజ్‌ కీపింగ్‌ సిబ్బందికి విద్యార్థుల చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. స్కూల్‌ ప్రిన్సిపాల్‌ తనుప్రీత్‌ కౌర్‌ మాట్లాడుతూ కార్మికుల సేవలను అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో స్కూల్‌ డైరెక్టర్‌, హెచ్‌ఆర్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన డీసీపీ

సనత్‌నగర్‌: భద్రత విషయంలో సీసీ కెమెరాలు భరోసానిస్తాయని బాలానగర్‌ డీసీపీ సురేష్‌కుమార్‌ అన్నారు. సనత్‌నగర్‌ రైల్వేస్టేషన్‌ రోడ్డులో జింకలవాడ, దీన్‌దయాళ్‌నగర్‌ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 50 సీసీ కెమెరాలను సోమవారం ఆయన ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాల కళ్లుగప్పి నేరస్తులు తప్పించుకోలేరన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభించిన డీసీపీ సురేష్‌కుమార్‌

ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తం

● బందోబస్తు నడుమ మారేడుపల్లిలోని డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు ఖాళీ
● కేటాయింపులో జాప్యం వల్లే ఆక్రమించామంటున్న ఆశావహులు



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ కొంతం దీపిక

కంటోన్మెంట్‌: మారేడుపల్లిలోని డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తంగా మారింది. వందలాది మంది పోలీసుల బందోబస్తు నడుమ, రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులను డబుల్‌బెడ్‌రూమ్‌ ఇళ్ల నుంచి బయటకి పంపేశారు. సోమవారం ఉదయం 6.00 గంటలకే భారీ పోలీసుల బలగంతో రెవెన్యూ అధికారులు మారేడుపల్లి డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల సముదాయానికి వచ్చారు. బయటి వ్యక్తులు ఎవరూ లోపలికి రాకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో ఇంటికి వెళ్లి లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించి, అక్రమంగా ఉంటున్నవారిని గుర్తించి బయటకు వెళ్లిపోవాలని సూచించారు. ఆయా ఇళ్లలోని సామాన్లు బయటికి తీసి, తాళాలు వేశారు. ఖాళీగా ఉన్న ఇళ్లను పక్షం రోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తామని అధికారులు ప్రకటించారు.

ఖాళీ చేసి తొమ్మిదేళ్లు..

మారేడుపల్లి పోలీసుస్టేషన్‌ ఎదురుగా ఉన్న హౌసింగ్‌ బోర్డు స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి బదలాయించి, డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. సుమారు 200 కుటుంబాలను ఖాళీ చేయించి 4.19 ఎకరాల స్థలంలో 536 డబుల్‌ బెడ్‌రూమ్‌లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే కోర్టు కేసుల కారణంగా కొంత స్థలాన్ని సేకరించలేకపోయారు. దీంతో 468 ఇళ్లను మాత్రమే నిర్మించగలిగారు. వీటిలో మూడేళ్ల క్రితం 273 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. డబుల్‌ ఇళ్ల కోసం ఖాళీ చేయించిన ఇళ్ల వైశాల్యం ప్రకారం ఎక్కువ విస్తీర్ణంలో స్థలాన్ని కోల్పోయే వారికి ఒకటి కంటే ఎక్కువ డబుల్‌ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. నిర్మాణం పూర్తయి మూడేళ్లు అవుతున్నా ఇళ్లను కేటాయించకపోవడంతో కొందరు వాటిని ఆక్రమించుకుని అక్కడే నివసిస్తున్నారు. తాజాగా మిగిలిన డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల కేటాయింపు కోసం క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలను గుర్తించారు. దీంతో ఆయా ఇళ్లను ఖాళీ చేయించేందుకు ఆర్‌డీవో సాయిరామ్‌ ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. సోమవారం ఉదయమే పోలీసు బందోబస్తు నడుమ డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల సముదాయానికి వచ్చారు. ఆక్రమణలదారులను ఖాళీ చేయించేందుకు యత్నించగా వారు తీవ్రంగా ప్రతిఘటించారు. డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు ఇచ్చామంటూ పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు వెంటనే ఖాళీ ఇళ్లను తమకు కేటాయించాలని కోరారు. అయితే పక్షం రోజుల్లోనే లబ్ధిదారులను గుర్తించి, ఖాళీ డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల కేటాయింపు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. స్థానిక కార్పొరేటర్‌ కొంతం దీపిక ఘటనా స్థలికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా ఖాళీ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు.

ఉగ్రమూకలను తుదముట్టించాలి



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న గాంధీ పాలనా యంత్రాంగం, వైద్యులు, అధికారులు

గాంధీఆస్పత్రి : పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీయూనిట్‌ అధ్యక్షుడు ప్రొఫెసర్‌ భూపేందర్‌సింగ్‌ రాథోడ్‌ డిమాండ్‌ చేశారు. టీజీజీడీఏ గాంధీయూనిట్‌ ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి, మెడికల్‌ కాలేజీల ప్రాంగణాల్లో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఉగ్రమూకలను తుదముట్టించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఎన్‌ రాజకుమారి, ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిర, డిప్యూటీ సూపరింటెండెంట్‌ సునీల్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రవిశేఖరరావు, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, టీజీజీడీఏ గాంధీయూనిట్‌ ప్రతినిధులు డాక్టర్‌ అబ్బయ్య, మురళీధర్‌, రవి, కళ్యాణ్‌, సుబోధ్‌కుమార్‌, బ్రహ్మేశ్వర్‌, మీనాక్షి, సరిత, ఉపేందర్‌, కళ్యాణచక్రవర్తిలతోపాటు జూడాలు, వైద్య, నర్సింగ్‌ విద్యార్థులు, టీఎస్‌జీవో నర్సింగ్‌ ఆఫీసర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు..



సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: ఆర్థిక సమస్యల కారణంతో వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ కోరారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించి మంజూరు పత్రాలను కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావు, అశోక్‌యాదవ్‌, ఖలీల్‌, శేఖర్‌, కూతురు నర్సింహ్మా, బలరాం, వనం శ్రీనివాస్‌, జమీర్‌, వసీం, బాషా, లక్ష్మీ పాల్గొన్నారు.

చేపలవేటపై హక్కులను | గంగపుత్రులకు మాత్రమే ఇవ్వాలి

బౌద్ధనగర్‌: గంగపుత్రులు, బెస్త, గుండ్ల కులస్తుల సంప్రదాయం చేపలవేట మాత్రమేనని అందుకే దీనిపై వారికి మాత్రమే హక్కు కల్పించాలని రాష్ట్ర మత్స్య శాఖ సంచాలకులు మురళీకృష్ణకు తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం వినతి పత్రం అందించారు. ముదిరాజ్‌లు, ముత్తిరాసి, తెనుగు కులస్తుల వృత్తి పూలు, పండ్లు అమ్మడమని మత్స్యకారులు కారని అందువల్ల మత్స్యకార సొసైటీలో వాళ్లకు సభ్యత్వం కల్పించకూడదని సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్‌ దేశబోయిన రఘు ఆయనను కలిసి విన్నవించారు. వారికి సభ్యత్వం కల్పించే నిజంగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గంగపుత్రులను వృత్తికి దూరం చేసినట్లు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కొండ యాదగిరి, కార్యదర్శి వంగల సుధాకర్‌, సహాయ కార్యదర్శి కంటే సతీష్‌, సభ్యులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

ఉత్సాహంగా 'గ్రాండ్‌ మా' వేడుకలు



గ్రాండ్‌ మా వేడుకల్లో జెక్‌కాలనీ మహిళలు..

సనత్‌నగర్‌: జెక్‌కాలనీలో గ్రాండ్‌ మా వేడుకలు సోమవారం సాయంత్రం ఉత్సాహంగా జరిగాయి. సంప్రదాయ విలువలు నేటి తరానికి అందించే వారధులు లాంటి అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా గ్రాండ్‌ మా ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. క్రమశిక్షణ, నడవడిక, భారతీయ సంస్కృతీ సంప్రదాయ విలువల గొప్పతనాన్ని ఈ వేడుకల ద్వారా వారు చాటిచెప్పారు. ఉమ్మడి కుటుంబాల్లో ఉండే మాధుర్యాన్ని ఆవిష్కరించారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు చెప్పే మంచి మంచి కబుర్లు, చిట్టి చిట్టి కథలు పిల్లల్లో ధైర్య సాహసాలను, ఆత్మవిశ్వాసాన్ని ఏవిధంగా పెంపొందింపజేస్తాయో ఈ ఉత్సవం ద్వారా తెలియజేశారు.. గ్రాండ్‌ మా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రభ అనంతరెడ్డి, ఎస్‌.అన్నపూర్ణ, లంకా హైమావతిల ఆధ్వర్యంలో గ్రాండ్‌ మా ఉత్సవ వేడుకలు ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలు అమ్మమ్మలు, నాన్నమ్మలతో ఈ తరానికి మధురమైన అనుభూతులను అందించాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధి, దేవాదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ ఎస్‌.అన్నపూర్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు నడవడిక, క్రమశిక్షణ, నైతిక విలువలకు కట్టుబాట్లు, వారి విలువైన మాటలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కానీ నేటితరం న్యూక్లియర్‌ కుటుంబాలకు అలవాటుపడిపోవడంతో అమ్మమ్మలు, నాన్నమ్మల నుంచి అందుకోవాల్సిన ఉన్నత ఆశయాలు, స్ఫూర్తిని అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆనాటి తరం స్ఫూర్తి, ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయాలన్నదే గ్రాండ్‌ మా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి ఇంట్లో ఉండే అమ్మమ్మలు, నాన్నమ్మలను గౌరవించడంతో పాటు వారి అనుభవాలను ఆదర్శంగా తీసుకుని ఈ తరం పిల్లలు ముందుకుసాగాలన్నారు. అమ్మమ్మలు, నాన్నమ్మలతో పాటు వారి మనుమలకు ఆయా అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, పూర్మానీ భాగ్యలత, అరుణజ్యోతి, సుజాత, శ్రీరమణి, ఉమ, మహాలక్ష్మీలను సన్మానించి కిరిటాలను ధరింపజేశారు. డప్పర్‌వేర్‌ మేనేజర్‌ మమత బహుమతులను సమకూర్చారు.

450 మందికి ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్ల జారీ

● అమర్‌నాథ్‌ యాత్రికులకు 'గాంధీ'లో వైద్య పరీక్షలు



అమర్‌నాథ్‌ యాత్రికుల వైద్య నివేదికలు పరిశీలిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: మంచు లింగాన్ని దర్శించుకునేందుకు వెళ్లే 450 మంది అమర్‌నాథ్‌ యాత్రికులకు ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు గాంధీ మెడికల్‌ రికార్డు సెక్షన్‌ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో అమర్‌నాథ్‌ యాత్ర సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం నిర్వహించిన మెడికల్‌ బోర్డులో అర్హులైన 42 మందికి సర్టిఫికెట్లు అందించారు. గాంధీ ఎంఆర్‌డీ విభాగంలో ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలు, ఆధార్‌ కార్డుతో నేరుగా హాజరై దరఖాస్తు చేసుకోవాలని, ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దళారులను ఆశ్రయించవద్దని గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఎన్‌ రాజకుమారి తెలిపారు. సీబీపీ, ఈఎస్‌ఆర్‌, సీయుఈ, బ్లడ్‌ యూరియా, సీరం క్రియాటిన్‌, ఈసీజీ, చెస్ట్‌ ఎక్స్‌రే నివేదికలను మెడిక్‌ల్‌ బోర్డుకు సమర్పించాలి. యాభై ఏళ్ల వయసు పైబడినవారు పై నివేదికలతోపాటు రెండు మోకాలి (బోత్‌నీస్‌) ఎక్స్‌రేలు జత చేయాలి. ఆర్థోపెడిక్‌, కార్డియాలజీ, పల్మనాలజీ, జనరల్‌ మెడిసిన్‌ వైద్యులు కిరణ్‌, జగదీష్‌రెడ్డి, భానుప్రియ, కృష్ణనాయక్‌, గాంధీ ఎంఆర్‌డీ సెక్షన్‌ ఆఫీసర్‌ యూసఫ్‌, వైద్య, నర్సింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై నేడు చర్చావేదిక

బొల్లారం: ఒకే దేశం..ఒకే ఎన్నిక పై చర్చించేందుకు 'థాట్‌ ఆర్క్‌ ఇండియా' ఆధ్వర్యంలో జాతీయ చర్చా వేదిక నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు తిరుమలగిరిలోని జయలక్ష్మీ గార్డెన్స్‌లోఈ చర్చ కార్యక్రమం జరగనుంది. ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌ బన్సల్‌, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌, బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం. సాయి ప్రసాద్‌ పాల్గొననున్నారు.